క్లుప్తంగా

రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సబిత

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన గరిసందుల సబిత రసాయనశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా సాధించారు. సబిత ప్రస్తుతం ఇచ్చోడ గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ చేయాలనే తపనతో ఉస్మానియా యూనివర్సిటీలో రసాయన శాస్త్రంలో 'ఇనార్గానిక్' అనే అంశంపై పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. పట్టుదల ఉంటే మహిళలు కూడా అనుకున్నది సాధించగలుగుతారని సబిత నిరూపించారు.

'మ్యాన్‌హోల్' మూసేశారు



మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాముని చెరువు ఎంట్రన్స్ ఆర్చి ఎదుట మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉందని, దానిని మూసేయాలని 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' శీర్షికన ఈ నెల 6వ తేదీన వచ్చిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం మ్యాన్‌హోల్‌ను మూసేసి, సిమెంట్‌తో చదును చేశారు.

కామర్స్ అతిథి అధ్యాపక పోస్టుకు ఆహ్వానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుని పోస్టు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఈ పోస్టుకు పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో పాసయ్యి ఉండాలన్నారు. బయోడేటా, బోనోఫైడ్, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, కాస్ట్‌కోషన్, కులం జిరాక్స్ కాపీలను జతపరిచి కళాశాలకు 9వ తేదీ ఉదయం పది గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. అదే రోజున త్రిసభ్య కమిటీ ద్వారా జరిగే ఇంటర్వ్యూ, డెమో ద్వారా అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జీవిత బీమా.. భవిష్యత్‌కు ధీమా




అవగాహన కల్పిస్తున్న వెంకటస్వామి

నెన్నెల: బీమా చేయడం అంటే భవిష్యత్ కోసం పొదుపు చేయడమని ఐపీపీబీ మంచిర్యాల బ్రాంచి సీనియర్ మేనేజర్ వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం తపాలా శాఖ బెల్లంపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విక్రమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. నెన్నెల పోస్టుమాస్టర్ రాజబాబు, కార్యదర్శి సాగర్, వివిధ మండలాల బ్రాంచి పోస్టుమాస్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఫ్లాగ్‌డే నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: స్కాట్ గైడ్స్ యూనిట్లు ఉన్న పాఠశాలల్లో ఫ్లాగ్ డే నిర్వహించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శ్యాంరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల స్కాట్, కట్ మాస్టర్లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అన్ని స్కాట్ గైడ్స్ యూనిట్లు ఉన్న పాఠశాల ఫ్లాగ్ డే నిర్వహించాలన్నారు. ఫ్లాగ్ డే స్టిక్కర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, నాయకులు శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వెంకటస్వామి



వెంకటస్వామి

కెరమెరి: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కూటికల వెంకటస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఎస్సీ సెల్ విభాగం కుమురం భీం జిల్లా చైర్మన్ పస్తం పోషం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

గుట్టుగా 'బెల్టు' దందా..!

- కిరాణాషాపుల్లో మద్యం విక్రయాలు
- మహారాష్ట్ర నుంచి దేశీదారు సరఫరా
- ఎన్నికల నిబంధనలు బేఖాతరు



కిరాణా దుకాణంలో పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కొందరు అక్రమార్కులు గుట్టుగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు యథేచ్ఛగా కిరాణా దుకాణాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించారు. నోటిఫికేషన్ అనంతరం అధికారులు కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలు నిలిపి వేయాలని హుకుం జారీ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయినా నిర్వాహకులు తమ వ్యాపారాన్ని గుట్టుగా కొనసాగిస్తున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

రేటు పెంచి మరీ విక్రయం..

అటు ఎక్సైజ్, ఇటు పోలీసులు తనిఖీలు చేస్తుండడంతో బెల్ట్‌షాపుల నిర్వాహకులు అప్రమత్తమై పోలీసులకు చిక్కకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అధికారుల నిర్బంధం పెరిగిందని మద్యం ప్రియులకు చెబుతూ ఒక్కో 90 ఎంఎల్‌పై సుమారు రూ.20లు పెంచి వసూలు చేస్తున్నారు. ఒక్కో బీరుపై సుమారు రూ.40 అదనంగా వసూలు చేస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. కాగజ్‌నగర్‌రూరల్ ప్రాంతంలో పంచశీలనగర్‌లో మాత్రమే వైన్‌షాపు ఉంది. దీంతో మద్యం తాగాలంటే కాగజ్‌నగర్ లేదా పంచశీలనగర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం ప్రియులు బెల్ట్‌షాపులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులు రెట్టింపు ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. మండలంలోని రాస్పెల్లి, సారసాల, గజ్జిగూడ, గువ్వలగూడ, మోసం, ఆరెగూడ, గన్నారం, భట్‌పల్లి, అందవెల్లి, చింతగూడ, నజ్రూల్‌నగర్ తదితర గ్రామాల్లోని కొన్ని కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

దేశీదారు, గుడుంబా అమ్మకాలు..

మండలంలో దేశీదారు, గుడుంబా అమ్మకాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దేశీదారు మద్యంతో పాటు గుడుంబాకు తక్కువ ధర ఉండటంతో మద్యం ప్రియులు వీటిని ఆశ్రయిస్తున్నారు. సమీపంలోని మహారాష్ట్ర నుంచి దేశీదారును అక్రమ మార్గాల్లో ఇక్కడికి తరలించి గుట్టుగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో గుడుంబాను తయారుచేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఆరెగూడ, సారసాల, గజ్జిగూడ, మోసం, రాస్పెల్లి, నజ్రూల్‌నగర్ ప్రాంతాల్లో గుడుంబా తయారీ స్థావరాలు ఏర్పాటు చేసుకొని గుడుంబా తయారు చేసి ఇక్కడి నుంచి పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విక్రయాలు జరిపితే చర్యలు

కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దాడులు నిర్వహించి పలుచోట్ల కేసులు నమోదు చేశాం. అనుమతి లేకుండా మద్యం విక్రయించే వారిపై చర్యలు తప్పవు. దేశీదారు, గుడుంబా విక్రయించే వారిపై నిఘా పెట్టాం.

– మంగమ్మ, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

సారా తయారీ కేంద్రాలపై దాడులు



అధికారులు పట్టుకున్న నాటుసారా తయారీ సామగ్రి

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం అబ్కారీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు అబ్కారీశాఖ సీఐ మంగమ్మ వివరాలు వెల్లడించారు. మండలంలోని రణవెల్లి, లంబాడిహేటి గ్రామాలలోని నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. లంబాడిహేటి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న చంగునబాయి వద్ద 5లీటర్ల నాటుసారా పట్టుకొని కేసు నమోదు చేశారు. రణవెల్లి గ్రామ శివారులో 5వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలలో తనిఖీలు నిర్వహించగా చిప్ప చిరంజీవికి చెందిన కిరాణా దుకాణంలో నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీలలో అబ్కారీ శాఖ ఎస్సై స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

రమణారెడ్డి ఆశయాలు కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించిన అమరజీవి రమణారెడ్డి ఆశయాలను కొనసాగించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లో సోమవారం రమణారెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి స్థూపం వద్ద జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొగిళి మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. హక్కుల సాధనలో భాగంగా ఎంతో మంది ఏఐటీయూసీ నేతలు ప్రాణాలను కోల్పోయారని పేర్కొన్నారు. గోలేటిలోని కార్మికుల హక్కులతోపాటు ప్రజా సమస్యలపై పోరాడి అసాంఘిక శక్తుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన రమణారెడ్డి ఆశయ సాధనకు యూనియన్‌లోని ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, రాజేష్, కిరణ్‌బాబు, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శివరాం, ఆనంద్, దివాకర్, రఘునాథ్‌రెడ్డి, నర్సయ్య, అశోక్, అంజయ్య, సాయి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సొంతింటి పథకం అమలు చేయాలి

శ్రీరాంపూర్: కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే 5 గనిలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణి కార్మికులకు హక్కులను సాధించిన ఘనత, చరిత్ర ఐఎన్టీయూసీకి మాత్రమే ఉందన్నారు. తమ గుర్తింపు సంఘం కాలంలో అనేక హక్కులు, సదుపాయాలు కల్పించామన్నారు. వచ్చే గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసీని ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఐఎన్టీయూసీలో చేరగా, వారికి ఆయన కండువా కప్పి యూనియన్‌లోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు సీహెచ్ భీంరావు, గరిగే స్వామి, రవి, నాయకులు పాల్గొన్నారు.

గనిపై ఉద్యోగులకు ఓటుపై అవగాహన

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిపై సోమవారం కళాజాత బృందం ఆధ్వర్యంలో ఉద్యోగులకు ఓటుపై అవగాహన కల్పించారు. కార్మికులు వందశాతం ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు ముల్కల మురళి, వెల్తూరి పోశం, లచ్చన్న, రాజతిరుపతి, రవికుమార్, రవీందర్ తదితరులున్నారు.

పారుడువ్యాధి నివారణకు వ్యాక్సినేషన్

జన్నారం: గొర్రెలు, మేకలలో వ్యాప్తించే పారుడు వ్యాధికి తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వ్యాక్సినేషన్ చేశారు. పారుడు వ్యాధి అనేది గొర్రెలు, మేకల్లో వ్యాపించే అతి భయంకర వ్యాధి అని, ముందు జాగ్రత్తగా పశువుల్లో పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యాక్సి న్ వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలంలోని పలు గ్రామాల్లో 4750 గొర్రెలు, 1500 మేకలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు



అడవిలో నిర్మించిన అటవీ అధికారి క్వార్టర్

'అడవి'లో అధికారి భవనం

కెరమెరి: మండల కేంద్రంలో ఉండాల్సిన అటవీ అధికారి క్వార్టర్ అడవిలో నిర్మించారు. ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఏడాది కాలంగా ఎఫ్‌ఆర్‌వో మజారోద్దిన్ బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మండల కేంద్రంలో క్వార్టర్ నిర్మాణానికి స్థలం లేదని 2021లో రూ. 30 లక్షల నిధులతో అడవిలో నిర్మించారు. కాని ఇంత వరకు విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడంతో చిమ్మచీకట్లో కాలం వెళ్లదీస్తున్నారు. క్వార్టర్‌కు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో రాళ్లు, రప్పలు, పొలాల మధ్య ప్రయాణం చేయాల్సి వస్తుంది. కాగా నిర్మించిన రెండేళ్లకే భవనం గోడలు పగుళ్లు తేలుతున్నాయి. టైల్స్ ఊడిపోతున్నాయి.



పొలాల మధ్య నుంచి దారి




క్వార్టర్ వెళ్లేందుకు ఉన్న బండ రాళ్లు తేలిన రోడ్డు

కట్టిన కొద్ది రోజుల్లోనే కుంగిన కాలువ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గంగవాడలో ఇటీవల నూతనంగా నిర్మించిన మురికి కాలువ కుంగిపోయింది. ఎమ్మెల్యే నిధుల కింద మంజూరైన రూ.7లక్షల నిధులతో కాలువ నిర్మాణం పూర్తి కాగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, నాణ్యతా లోపం కారణంగా ఆ కాలువ కుంగిపోగా నిర్మాణ పనులు వృథా కాగా నిధులు మురికినీటి పాలయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి



వరిని పరిశీలిస్తున్న కిరణ్మయి

తాండూర్: వరి పొలాల్లో ప్రస్తుతం కంకులు ఏర్పడే దశలో ఉన్నాయని, ఈ సమయంలో పంటకు చీడపీడలు ఆశించకుండా రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వ్యవసాయాధికారి కిరణ్మయి సూచించారు. మండలంలోని కొమ్ముగూడెంలోని వరి పొలాలను సోమవారం స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పొలాల్లో సుడి దోమ ఉధృతితో పాటు పలు రకాల చీడలు ఆశించినట్లు గుర్తించారు. రైతులు ఇష్టారీతిన పురుగుమందులు పిచికారీ చేయకుండా, వ్యవసాయ నిపుణుల సలహాలతో మందులు పిచికారీ చేసి పంటను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ధనలక్ష్మి, రైతులు ఉన్నారు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారులు



కంకర తేలిన వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

సిర్పూర్(టి): మండలం మీదుగా వెళ్తున్న అంతర్రాష్ట్ర రహదారులు అధ్వానంగా మారాయి. మండల కేంద్రం మీదుగా వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి గుండా మహారాష్ట్రలోని గోండ్‌పిప్రి, అహెరి, ఆలపెల్లి, గడ్చిరోలి, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాలకు ప్రతి నిత్యం భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం నుంచి దౌనల్ ప్రాంతం వరకు రోడ్డు అధ్వానంగా మారడంతో పాటు మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలో, పెన్‌గంగ నదిపై ఉన్న వంతెన సమీపంలో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు ఆదమరిస్తే రోడ్డు ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుంది.

సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారి సైతం..

మండలం గుండా వెళ్తున్న మరో అంతర్రాష్ట్ర రహదారి సిర్పూర్(టి)– మాకిడి రోడ్డు గుండా మహారాష్ట్రలోని వీరూర్, రాజూరా, బల్లార్షా, చంద్రపూర్, నాగ్‌పూర్ తదితర పట్టణాలకు ప్రతినిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతర్రాష్ట్ర రహదారిలో స్థానిక బస్టాండ్ ప్రాంతం నుంచి గంగాయిగూడ కాలనీ వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు నరకప్రాయంగా మారింది. గంగాయిగూడ కాలనీ సమీపంలో కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడటంతో కల్వర్టు వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హుడ్కిలి గ్రామ సమీపంలో లోలెవల్ వంతెన పూర్తిగా బీటలు వారి గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి అంతర్రాష్ట్ర రహదారుల మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని మండల వాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండలం మీదుగా వెళ్తున్న రెండు అంతర్రాష్ట్ర రహదారులు అధ్వానంగా మారాయి. అంతర్రాష్ట్ర రహదారుల గుండా బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలు, ద్విచక్రవాహనాలపై రాకపోకలు కొనసాగిస్తున్నాం. రోడ్లు గుంతలమయంగా ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అంతర్రాష్ట్ర రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.

– కాసర్ల కృష్ణ, దహెగాం

అధికారులు స్పందించాలి



అంతర్రాష్ట్ర రహదారులు గుంతలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నో ఏళ్లుగా అంతర్రాష్ట్ర రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అంతర్రాష్ట్ర రహదారులకు మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి.

– ఎర్ర మల్లేశ్, సిర్పూర్(టి)

'బీజేపీతోనే సిర్పూర్ అభివృద్ధి'



కౌటాల: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



దహెగాం: ప్రచారంలో బీజేపీ నాయకులు

కౌటాల: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సిర్పూర్ అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కన్నెపల్లి గ్రామంలో బీజేపీ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబును ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, మధుకర్, చందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబుకు మద్దతుగా బీజేపీ నాయకులు కోత్మీర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కమలం పువ్వుకు ఓటు వేయాలని కోరారు. నాయకులు సురేష్, రాజాగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెజ్జూర్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన సతీమణి కొండ్ర అరుణ గౌడ్‌తో కలిసి మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును ఆదరించాలని కోరారు. నాయకులు రాజారాం, సుందర్ కృష్ణ, ఏలేశ్వరం రమేశ్, నికురి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ఖర్చుల కోసం విరాళం

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ఖర్చుల నిమిత్తం వ్యాపారులు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుకు విరాళం అందజేశారు. హరీశ్‌బాబు మీద అభిమానంతో పట్టణానికి చెందిన వ్యాపారులు శివ గౌడ్, అరుణ్ కుమార్, రాజు, జ్యోతిష్, నందులాల్, ఫారిక్, రాజయ్య, మోర్ల నానాజీ, రామచందర్, టోని ప్రకాశ్, మార్కండేయ, సిందం చంద్రయ్యలు సోమవారం డబ్బులు అందజేశారు.

తల్లీబిడ్డల సంరక్షణపై 'ఆశ'లకు అవగాహన



ఆశ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వినయ్

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మండల వైద్యాధికారి ఉప్రె వినయ్ ఆధ్వర్యంలో నెలవారి ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లీ, అప్పుడే పుట్టిన బిడ్డ పట్ల తీసుకోవాల్సిన సంరక్షణ, దాని ఆవశ్యకతపై ఆశ వర్కర్లకు, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. మారుమూల గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు సూచించాల్సిన అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, పబ్లిక్ హెల్త్ నర్స్ క్రిష్టియాన, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.